క్లుప్తంగా

అభ్యర్థిని మార్చొద్దు



రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో ఆదివారం ఎమ్మెల్యే అబ్రహంకు మద్దతుగా ఆయన అభిమానులు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చొద్దని, అభ్యర్థిగా అబ్రహం ఉంటేనే పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్రామన్‌గౌడ్, నాగేష్, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడా దినోత్సవ ర్యాలీ

గద్వాల: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 6గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ర్యాలీ అనంతరం స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో 'చలో మైదాన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సరితారాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కుంటుపడిన అభివృద్ధి



గద్వాల అర్బన్: కొన్ని దశాబ్దాలుగా కుటుంబ పాలనతో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన నాయకత్వం కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, విజయ్‌కుమార్, వెంకట్రాములు, లక్ష్మన్న పాల్గొన్నారు.

రామాపురం సర్పంచ్ మృతి



బీసన్నగౌడ్ (ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామ సర్పంచ్ బీసన్నగౌడ్ (63) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారంలో మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటూ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శనివారం ఆయన ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హన్మిరెడ్డి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయ కులు బీసన్నగౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీఎస్పీ జెండాపండుగ



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో ఆదివారం బీఎస్పీ జెండాపండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ప్రభుదాస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యన్న, శివశంకర్‌గౌడ్, నాగేంద్రం, రాజు, మహేష్, ఐలన్న, శ్రీకాంత్, కాంతన్న పాల్గొన్నారు.

వెలగని విద్యుత్ దీపాలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకు వరప్రదాయనిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రుల్లో అంధకారం ఉంటోంది. డ్యాం పరిసరాలు, రహదారి చీకటిగా మారుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. జూరాల నీటితో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తి ఇక్కడి నుంచే చేస్తున్నా ప్రాజెక్టుపై మాత్రం వెలుగులకు నోచుకోవడం లేదు. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రాజెక్టు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

టీకా.. లేదిక ధోకా!

- మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి శ్రీకారం
- చిన్నారులు, గర్భిణులకు వ్యాధులు సోకకుండా చర్యలు
- మొదటి విడత పూర్తి
- హెల్త్ సెంటర్లలో టీకాల పంపిణీ



చిన్నారికి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

గద్వాల క్రైం: ఐదేళ్లలోపు చిన్నారులతోపాటు గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఇటీవల ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలియో, ధనుర్వాతం, క్షయ, తట్టు తదితర వ్యాధులతోపాటు ఇన్‌ఫెక్షన్ సోకకుండా ముందుస్తుగా టీకాల పంపిణీ చేపట్టింది. వ్యాక్సినేషన్ ప్రక్రియను మూడు విడతలుగా కొనసాగించాలని ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 12న మొదటి విడత కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అయితే ఏఎన్ఎంల ఆందోళన నేపథ్యంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

అన్ని హెల్త్ సెంటర్లలో..

జిల్లా వ్యాప్తంగా 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు, 91 సబ్ సెంటర్లలో టీకాలు వేస్తున్నారు. అయితే గతంలో ఏడు రకాల టీకాలను మాత్రమే వేసేవారు. ప్రస్తుతం రోగ నిరోధక శక్తిని పెంచడానికి వాటి సంఖ్యను పెంచారు. ప్రతి సంవత్సరం మూడు విడతల్లో మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ సంవత్సరం ఈనెల 6న ప్రారంభించి 12వ తేదీన పూర్తి చేశారు. రెండోవిడత సెప్టెంబర్ 11నుంచి 16 తేదీవరకు, మూడో విడత అక్టోబర్ 9 నుంచి 14 వరకు టీకాలను వేయనున్నారు.

వివరాలు సేకరణ..

పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆస్పత్రుల్లో టీకాలు అందుబాటులో ఉంటాయి. ప్రతి బుధ, శని వారాల్లో గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేస్తారు. వైద్యసిబ్బంది ఆయా సెంటర్లను సందర్శించి అక్కడ రెగ్యులర్‌గా టీకాలు వేసుకోని వారి వివరాలు సేకరిస్తున్నారు. మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం కింద టీకాలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. గర్భిణులకు టీడీ (టెటానస్ అండ్ డిప్తీరియా), చిన్నారులకు టీబీ, పోలియో, హైపటైటీస్‌బి, రోటా వైరస్, నిమోకోకల్ న్యుమోనియా, మీజిల్స్, రుబెల్లా, జననీస్ ఎన్‌సెఫలిస్ టీకాలు ఇస్తారు.

లక్ష్యం మేరకు పూర్తి చేస్తాం..



మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు టీకాలను వందశాతం వేస్తాం. టీకాలు వేసుకోని గర్భిణులు, చిన్నారులను గుర్తించి టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశాం. ప్రతి గర్భిణి, చిన్నారుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మొదటి విడతలో రెండేళ్లలోపు చిన్నారులు 456మందిని గుర్తించగా, 421 మందికి టీకాలు వేశాం. 1–2 ఏళ్లలోపు 164మందికిగాను 158మంది, 2–5 ఏళ్లలోపు 193మందికిగాను 181మంది, గర్భిణులు 133 మందికిగాను 133 మందికి టీకాలు వేశాం.

– శశికళ, జిల్లా ఇన్‌చార్జ్ వైద్యారోగ్యశాఖ అధికారిణి

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కోరారు. ధరూరు మండలం పార్చర్ల, గట్టు మండలంలోని ఇందువాసి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి జెడ్పీ చైర్‌పర్సన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పూర్వవైభవం తీసుకురావాలి

మల్దకల్: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జెడ్పీచైర్మన్ సరిత పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని, వాటిని ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమాల్లో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటస్వామిగౌడ్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, ఆనంద్, మల్లకల్, ఆంజనేయులు, కిష్టన్న, మద్దిలేటి, రాముడు, గోపాల్ పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. సీఐటీయూ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాల అమలు, పారిశుద్ధ్య, పంచాయితీ, మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడం, భవన నిర్మాణ కార్మికులకు బైక్‌లు, స్కూటీల పంపిణీ, స్కీం వర్కర్లకు మెరుగైన వేతనాల చెల్లింపు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు రక్షణ చట్టం తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, వెంకటేష్, బాషా, తిమ్మప్ప, గజేంద్ర, ఉప్పేరు నర్సింహ తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మల్దకల్‌లో బీసీబంధు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఆదివారం రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్పతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు బీసీబంధుతో రూ.లక్ష సాయం అందిస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారాంరెడ్డి, విక్రంసింహారెడ్డి, సత్యారెడ్డి, చక్రధర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటన్న, నరేందర్, నారాయణ, కృష్ణారెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

గద్వాల రూరల్: డీఎస్సీ అభ్యర్థులకు కేసీఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 28నుంచి సెప్టెంబర్ 3వ తేదీవరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

సుపరిపాలన ఘనత కేసీఆర్‌దే



రాజోళిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతోందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. ఇటిక్యాల మండలం షాబాద్, శనగపల్లి ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో దాదాపు 300మంది ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అబ్రహంను ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అదేవిధంగా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు.

రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

రాజోళి: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలో రూ.13లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, ఉపసర్పంచ్ గోపాల్, వైస్ఎంపీపీ రేణుక, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, శ్రీరాంరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత విద్యను విస్మరిస్తున్న ప్రభుత్వం



అలంపూర్: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉన్నత విద్య అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో అత్యధికశాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అతిపెద్ద మండలమైన అయిజలో డిగ్రీ కళాశాలతోపాటుగా బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డేపల్లి, రాజోళి మండలాల్లో జూనియర్ కళాశాలల ఏర్పాటు కోసం పోరాటాలు నిర్వహిస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, అధికార ప్రతినిధి రాజగోపాల్, నాగమద్దిలేటి, జగన్మోహన్, బంగారు లక్ష్మణ్, నర్సింహశెట్టి, సుధాకర్‌యాదవ్, లక్ష్మణ్, వేణుకుమార్, ప్రదీప్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, వినీత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన నాయకులు

అయిజ: పట్టణానికి చెందిన బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ నివాసంలో ఆదివారం కార్యకర్తలతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్ కీ బాత్ వీక్షించడం వల్ల అనేక విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో భీమసేనరావు, నర్సింహయ్యశెట్టి, అంతంపల్లి కృష్ణ, కళ్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య నోట.. ఉండవెల్లి కుర్రోడి మాట

ఉండవెల్లి: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన స్కంద సినిమా ప్రీ రిలీజ్ షోలో పాల్గొన్న సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఉండవెల్లి కృష్ణ గురించి చేసిన ప్రస్తావన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తెలంగాణ కుర్రోడు కృష్ణ చంద్రయాన్–3లో భాగస్వామ్యం కావడం గర్వకారణమని బాలకృష్ణ కొనియాడారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ



జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో సోమవారం ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. అదేవిధంగా ఆటోల ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గద్దర్ సంస్మరణ సభకు ఉద్యమకారులు, ప్రజా, కుల, విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మధుసూదన్‌బాబు, వాల్మీకి, కోళ్ల హుస్సేన్, గోపాల్‌రావు, నాగన్న, మన్యం, విజయ్‌కుమార్, మక్బూల్ పాల్గొన్నారు. అదేవిధంగా టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న మాట్లాడారు. గద్దర్ తన ఆటపాటలతో పాలకుల విధానాలను ఎండగట్టి ప్రజలను చైతన్యపర్చారని, సంస్మరణ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, తిరుమల్లేష్, తిమ్మప్ప, వేణుగోపాల్ ఉన్నారు.

అయిజ: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని పౌరహక్కుల సంఘం నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, ఆర్.శ్రీధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధరూరు: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు వాల్మీకి, హుస్సేన్ కోరారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో రైతు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

6న బహుజన దివ్యాంగుల భరోసా సభ



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

శాంతినగర్: బీఎస్పీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న అయిజలో బహుజన దివ్యాంగుల భరోసా సభ నిర్వహించనున్నట్లు వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు జైపాల్ తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో ఆదివారం దివ్యాంగుల భరోసా సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల కష్టాలను తెలుసుకునేందుకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, సవారన్న, భాగ్యమ్మ, నాగవేణి, కృష్ణ, మధుగౌడ్, రవిచందర్, వెంకటేష్, జలంధర్, ప్రభుదాస్, యువరాజు పాల్గొన్నారు.

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ



ఏబీవీపీ, రెడ్డి సేవాసమితి నాయకులకు రాఖీ కడుతున్న మహిళలు

గద్వాల అర్బన్: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ అని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్, రెడ్డి సేవాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ, రెడ్డి సేవాసమితి నాయకులకు మహిళా విభాగం సభ్యులు, వసతిగృహం విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో రెడ్డి సేవాసమితి నాయకులు వెంకట్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలి



అయిజలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ

రాజోళి: ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండలంలో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, ఇందుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా పొందుపర్చాలని బీఎల్‌ఓలకు సూచించారు. తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ పాల్గొన్నారు.



గట్టులో..

గట్టు: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ శ్రీనివాసులు పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వారీగా దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. 18ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

రజకులందరికీ 'బీసీబంధు' ఇవ్వాలి



మాట్లాడుతున్న నర్సింహులు

గద్వాల అర్బన్: దరఖాస్తు చేసుకున్న రజకులందరికీ బీసీబంధు ఇవ్వాలని చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కమ్యూనిటీహాల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో చాకలి కులస్తులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, తెలంగాణలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రజకులను విస్మరిస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, కోశాధికారిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి పాలాభిషేకం



మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించడంపై ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని, అంబేద్కర్ ఆశయహస్తం కింద రూ.12లక్షల ఆర్థిక సాయం, ఇల్లు లేని ప్రతి దళిత, గిరిజనులకు ఇంటి స్థలంతోపాటు రూ.6లక్షల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కున్న ఎస్సీ, ఎస్టీల భూములను అన్ని హక్కులతో తిరిగి అప్పగిస్తామన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్, నారాయణరెడ్డి, ఇసాక్, నందు, కిఫాయత్, వెంకటేష్, దినేష్, ఇలియాస్, రఫీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.